## పోలింగ్ బూత్‌ల పరిశీలన



మోత్కూరు : పాటిమట్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు బాలకిషన్ ముండా

మోత్కూరు, నవంబర్15 : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ బాలకిషన్ ముండా ఐఏఎస్ బుధవారం పరిశీలించారు. మండలంలోని పాటిమట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బూత్ నంబర్ 18, మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని బూత్ నంబర్ 7, 8, 9లను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణ, సదుపాయాల కల్పన, అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. మండల ఎన్నికల సహాయాధికారులు రామ్‌ప్రసాద్, శ్రీకాంత్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు.

### అడ్డగూడూరులో..

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలోని బూత్ నంబర్ 54, 55, 56ను అలాగే చౌళ్లరామారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం బూత్ నంబర్ 53ను జనరల్ అబ్జర్వర్ బాలకిషన్‌ముండా పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు, వసతుల కల్పనపై సంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎస్ఎంసీ చైర్మన్ మల్లేశ్

నాగారం, నవంబర్ 15 : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని నాగారం ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ చిప్పలపల్లి మల్లేశ్ అన్నారు. బుధవారం ప్రాథమిక పాఠశాలలో రాజీవ్ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అలాగే విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత, దంతాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వర్దెల్లి మల్లయ్య, వైద్యులు గౌతం, స్పందన, ఫార్మాసిస్ట్ సతీశ్, ఏపీహెచ్ఐ గీత, ఆశా వర్కర్ రేణుక, ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేశ్ పాల్గొన్నారు.

## లైంగిక దాడి కేసులో యువకుడికి 20 ఏండ్లు జైలు

మోత్కూరు, నవంబర్ 15 : బాలికపై లైంగిక దాడి కేసులో యువకుడికి న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. బుధవారం ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మండలం పాటిమట్లకు చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన మైనర్‌పై లైంగిక దాడి చేశాడనే అభియోగంతో 2022లో పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. విచారణలో దోషిగా తేలడంతో భువనగిరి కోర్టు యువకుడికి 20 ఏండ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.11 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. అలాగే బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# అభివృద్ధికి పట్టం కట్టండి

- ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్
- అర్వపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం



కాసర్లపాడు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

అర్వపల్లి, నవంబర్ 15 : తుంగతుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు.. మరోమారు ఆశీర్వదించి అభివృద్ధికి పట్టం కట్టాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని కాసర్లపహాడ్, కొమ్మాల, నాణ్యాతండా, లోయపల్లి, కోడూరు, సూర్యనాయక్‌తండా, కోమటిపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేల కోట్లతో తుంగతుర్తి నియోజక వర్గ రూపురేఖలు మార్చినట్లు తెలిపారు. ఆరు మండలాలకు కలిపి 95 వేల ఎకరాలకు కాళేశ్వరం జలాలు తీసుకువచ్చి రైతుల కాళ్లు కడిగినట్లు చెప్పారు. నియోజక వర్గంలో 50 వేల మందికి ఆసరా పెన్షన్లు, 95 వేల మందికి రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్ వంటి అనేక రకాల సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందించినట్లు వివరించారు. ఎన్నికల తర్వాత తెల్లరేషన్ కార్డుదారులకు సన్న బియ్యం, కేసీఆర్ బీమా, 400కే గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు గృహలక్ష్మి, బీసీ బంధు, దళిత బంధును అర్హులైన వారికి దశల వారీగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ గ్యారెంటీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఒకప్పుడు కక్షలతో, రక్తపు మరకలతో రగిలిన నియోజక వర్గం నేడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ప్రశాంత వాతావరణం మధ్య జీవిస్తున్నట్లు చెప్పారు. అందుకు చిహ్నంగా కొమ్మాలలో ఎమ్మెల్యే శాంతి కపోతాన్ని ఎగురవేశారు. 3 గంటల కరెంట్ చాలన్న కాంగ్రెస్ పార్టీకి ఓటేద్దామా? లేక 24 గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపుదామో రైతులు ఆలోచించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ బొడ్డు భద్రమ్మ, గుండగాని సోమేశ్‌గౌడ్, రామలింగయ్య, మొరిశెట్టి ఉపేందర్, గ్రంథాలయ చైర్మన్ పి.యుగేంధర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాసర్లపహాడ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

### నేడు నూతనకల్ మండలంలో ఎమ్మెల్యే కిశోర్ ఎన్నికల ప్రచారం

నూతనకల్, నవంబర్ 15 : ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ గురువారం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మాచనపల్లి, బిక్కుమళ్ల, పెదనెమిల, దిర్శనపల్లి, కొత్తతండా గ్రామాల్లో ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

# ఓట్ల కోసం కాంగ్రెస్ చేసే జిమ్మిక్కులను నమ్మొద్దు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, నవంబర్ 15 : అధికారం కోసం కాంగ్రెస్ తహతహలాడుతున్నదని, ఓట్ల కోసం ఆ పార్టీ చేసే జిమ్మిక్కులను ప్రజలు నమ్మొదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సంక్షేమానికి పాటు పడే బీఆర్ఎస్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బుధవారం మోత్కూరు మండలం అనాజిపురంలో బీఆర్ఎస్ తుంగతుర్తి అభ్యర్థి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు మద్దతుగా ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేండ్ల కాలంలో కాంగ్రెస్ నాయకులు ఏనాడు కూడా ప్రజల సమస్యలను పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు ఎన్నికల్లో ఓట్ల కోసం అబద్ధపు ప్రచారాలు, ఆచరణలో సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేయడం కోసం కుట్రలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా పని చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం మరోసారి రావడం కోసం ప్రజలు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సంతోశ్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, సర్పంచ్ ఉప్పల లక్ష్మీయాదయ్య, శంకరయ్య పాల్గొన్నారు.



మోత్కూరు : అనాజిపురంలో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



మోత్కూరు : పాటిమట్లలో ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నార్మాక్స్ డైరెక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి



అడ్డగూడూరులో మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్ సతీమణి కమల

### బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి : ఎమ్మెల్యే కిశోర్ సతీమణి కమల

అడ్డగూడూరు : నవంబర్ 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సతీమణి కమల ప్రజలను కోరారు. మండల కేంద్రంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు ఓటు వేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజక వర్గంలో గత 60 ఏండ్లలో జరగని అభివృద్ధి కేవలం తొమ్మిదిన్నరేండ్లలో జరిగిందని తెలిపారు. నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందాలంటే గాదరి కిశోర్‌తోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దర్శనాల అంజయ్య, జడ్పీటీసీ శ్రీరాముల జ్యోతీఅయోధ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చౌగోని సత్యంగౌడ్, సర్పంచ్ బాలెంల త్రివేణి, నాయకులు పూలపల్లి జనార్దన్‌రెడ్డి, వడకాల రణధీర్‌రెడ్డి, కమ్మంపాటి పరమేశ్, పూజారి సైదులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు సంజీవరెడ్డి



నాగారం : పేరబోయినగూడెంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ మండల నాయకుడు ప్రేమయ్య



తుంగతుర్తి మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు